RNI-TELTEL/2017/72695

1 సెప్టెంబర్ 2023

# శుభ తెలంగాణ

శుక్రవారం | మేడ్చల్

ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :178

వెల:3 రూ/-

www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

# కాంగ్రెస్‌లోకి షర్మిల!

## ఢిల్లీలో సోనియా, రాహుల్‌తో కీలక భేటీ

- ఆమె చేరిక, పార్టీ విలీనం లాంఛనమే
- రేపు ప్రకటన వెలువడే అవకాశం!
- ఏపీలో స్టార్ క్యాంపెయినర్‌గా అవకాశం
- కర్ణాటక నుంచి రాజ్యసభకు కూడా?





**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఏపీ ముఖ్యమంత్రి జగన్ సోదరి వైఎస్ షర్మిల కాంగ్రెసలో చేరడం ఇక లాంఛనమే. ఆమె తన పార్టీ వైఎసఆర్‌టీపీని కాంగ్రెసలో కలిపేయడం నిశ్చయమైపోయిం ది. ఇదే అంశంపై కొంతకాలంగా కాంగ్రెస్ పెద్దలతో చర్చలు జరుపుతున్న ఆమె.. గురువారం ఉదయం ఢిల్లీలోని 10-జన్‌పథ్‌కు భర్త అనిల్‌తో కలిసి వెళ్లారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. 40 నిమిషాలకుపైగా చర్చలు జరిపారు. వైఎసఆర్‌టీపీ విలీనం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రాజకీయ పరిస్థితులపై ప్రధానంగా చర్చించినట్లు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పార్టీలో చేరికకు ఆమె ముహూర్తం కూడా ఖరారు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ చర్చల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. కాంగ్రెసలో వైఎసఆర్‌టీపీ విలీనంపై కొంతకాలంగా గట్టిగా ప్రచారం జరుగుతున్నా.. ఆ కథనాలను ఆమె ఖండించలేదు. అలాగని విలీనంపై ఆమె గానీ, కాంగ్రెస్ గానీ అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పుడు భర్తతో కలిసి సోనియా, రాహుల్‌లను కలవడంతో పూర్తి స్పష్టత వచ్చిందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. షర్మిలను కాంగ్రెసలోకి తీసుకొచ్చేందుకు మొదటి నుంచీ ఆసక్తి కనబరుస్తున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం అదే సమయంలో సోనియాను విడిగా కలవడం విలీన వార్తలకు బలం చేకూరుతోంది. శనివారం (సెప్టెంబరు 2న) వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నాడు వైఎసఆర్‌టీపీ విలీనంపై ప్రకటన వెలువడే అవకాశముందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

**భవిష్యత్‌పై స్పష్టత!**

ఏఐసీసీ అగ్ర నేతలతో షర్మిల ఇప్పటి వరకూ జరిపిన సంప్రదింపులు ఒక ఎత్తయితే.. గురువారం నాటి ముఖాముఖి చర్చలు మరో ఎత్తని అంటున్నారు. ఈ చర్చల్లో షర్మిల రాజకీయ భవిష్యత్‌పై అగ్ర నేతలు సంపూర్ణ స్పష్టత ఇచ్చారని కాంగ్రెస్ ముఖ్య నేతలు చెబుతున్నారు. నిజానికి, తొలి నుంచీ ఆమె తెలంగాణ వైపే మొగ్గు చూపుతున్నారు. సికింద్రాబాద్ లేదా పాలేరు నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని అభిలషిస్తున్నారు. కానీ, కాంగ్రెసలో వైఎసఆర్‌టీపీ విలీనంపై టీపీసీసీ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో షర్మిల సేవలను తెలుగు రాష్ట్రాల్లో ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. ఏపీ ఎన్నికల్లో ఆమె పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉండాలని ఏఐసీసీ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఏపీలో పార్టీ బాధ్యతలు కూడా చేపట్టాలని అగ్ర నేతలు కోరినట్లు తెలుస్తోంది. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కర్ణాటక నుంచి రాజ్యసభకు పంపించే

వివరాలు 2లో..

## సీఎం కేసీఆర్‌కు రాఖీ కట్టిన తోబుట్టువులు



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రగతిభవన్ లో రక్షాభంధన్ వేడుకలు ఘనంగా జరిగా యి. తోబు ట్టువుల ప్రేమానురాగా లు, అనుబంధాలకు వేదికగా సీఎం నివాసం నిలిచింది. సీఎం కేసీఆర్ కు ఆయన అక్క య్యలు లక్ష్మీబాయి, జయమ్మ, లలితమ్మ, చెల్లెలు వినోదమ్మ కలిసి కేసీఆర్‌కు రాఖీ కట్టి ఆశీర్వదించారు. తన తోబుట్టువులకు సీఎం కేసీఆర్ పాదాభివందనం

వివరాలు 2లో..

## రేపటి నుంచి తెలంగాణలో ఉపాధ్యాయుల బదిలీలు

- ఇటీవల తెలంగాణ హైకోర్టు తుది తీర్పు
- స్టే ఎత్తివేసిన న్యాయస్థానం
- టీచర్ల బదిలీలకు తొలగిన అడ్డంకులు
- రేపటిలోగా షెడ్యూల్ విడుదల చేయనున్న విద్యాశాఖ

వివరాలు 2లో..



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యా యుల బదిలీలకు కసరత్తులు చేస్తోంది. సెప్టెంబరు 2 నుంచి రాష్ట్రంలో టీచర్ల బదిలీ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇటీవల టీచర్ల బదిలీలకు తెలంగాణ హైకోర్టు పచ్చజెండా ఊపడంతో కేసీఆర్ ప్రభుత్వం ముందడుగు వేసింది. తుది తీర్పునకు లోబడే బదిలీలు చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, తెలంగాణ విద్యాశాఖ రేపటి లోగా షెడ్యూల్ విడుదల చేయనుంది.



## మోదీజీ.. ఇప్పటికైనా మాట్లాడండి!

అదానీ గ్రూప్ లో ఏదో జరుగుతోంది...

ఆ డబ్బు ఎవరిదో తెలియాలి

- అదానీ గ్రూప్ అక్రమాలపై మీడియాలో కథనాలు వచ్చాయన్న రాహుల్
- బిలియన్ డాలర్ల డబ్బు భారత్ నుంచి తరలి వెళ్లి, వివిధ మార్గాల్లో మళ్లీ వచ్చిందని వెల్లడి
- ఆ డబ్బు అదానీదేనా, లేక ఇతరులదా అంటూ ప్రశ్నించిన కాంగ్రెస్ అగ్రనేత
- ఈ కుంభకోణంపై విచారణ ఎందుకు జరిపించరంటూ ఆగ్రహం

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** అదానీ అంశంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి ధ్వజమెత్తారు. అదానీ గ్రూప్ అక్రమాలపై పత్రికల్లో కథనాలు వచ్చాయని వెల్లడించారు. అంతర్జాతీ యంగా ఎంతో పేరున్న పత్రికల్లో ఈ కథనాలు వచ్చాయని వివరించారు. బిలియన్ డాలర్ల ధనం

వివరాలు 2లో..

## నెలాఖరుకల్లా సీట్ల సర్దుబాటు!



- ముందస్తు ఎన్నికల వార్తల నేపథ్యంలో
- 'ఇండియా' కూటమి నేతల యోచన
- ముంబైలో ఇష్టాగోష్ఠి భేటీకి 28 పార్టీలకు చెందిన 63 మంది నేతలు
- నేటి సమావేశానికి అజెండా ఖరారు
- కూటమికి కన్వీనర్, కనీస ఉమ్మడి కార్యక్రమంపై నేడు చర్చ
- 11 మందితో సమన్వయకమిటీ
- కూటమి లోగోను ఆవిష్కరించే చాన్స్

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన విపక్షాల 'ఇండియా' కూటమి నేతలు.. సెప్టెంబరు 30కల్లా సీట్ల సర్దుబాటుపై తుదినిర్ణయానికి రావాలనే అభిప్రాయానికి వచ్చారు. గురువారం ముంబైలోని గ్రాండ్ హయత్ హోటల్‌లో వారంతా ఇష్టాగోష్ఠిగా సమావేశమై.. శుక్రవారం జరగబోయే సమావేశానికి ఎజెండా ఖరారు చేశారు. కూటమికి కన్వీనర్ ఉండాలా వద్దా? సీట్ షేరింగ్‌పై సబ్‌గ్రూపులను ఏర్పాటు చేయాలా? అనే అంశాలతోపాటు విపక్షాలన్నీ

వివరాలు 2లో..

## ఖర్గే, అమిత్ షా టూరిస్టుల్లా వచ్చి వెళ్లారు

కాంగ్రెస్, బీజేపీ నకిలీ, వెకిలి హామీలు ఇస్తున్నాయని మండిపాటు

నకిలీ డిక్లరేషన్లు ఇస్తే ప్రజలు నమ్మరని వ్యాఖ్య



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కేంద్ర మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేలు టూరిస్టుల ని తెలంగాణ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను విమర్శించే వాళ్లు రాష్ట్ర పరిస్థితిని చూసి మాట్లాడాలని అన్నారు.

వివరాలు 2లో..

## మాదాపూర్‌లో డ్రగ్స్ కలకలం

మాదాపూర్ డ్రగ్స్ పార్టీలో సినీ ఫైనాన్సియర్ సహా ఐదుగురి అరెస్ట్




- అరెస్ట్ అయిన వారిలో సినీ ఫైనాన్సియర్ వెంకట్
- వెంకట్ కదలికలపై మూడు నెలల నుంచి నిఘా
- గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్ లో రేవ్ పార్టీలు

వివరాలు 2లో..

## హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ

- ఈ నెల 16, 17 తేదీల్లోకాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం
- 17న విలీన దినోత్సవానికి హాజరవనున్న సోనియా
- తెలంగాణ కోసం పార్టీ త్యాగాల్ని వివరించే అవకాశం
- 18న రాష్ట్రంలో 100 మంది కాంగ్రెస్ పెద్దల పర్యటన
- అక్టోబరు 2 నుంచి నెల పాటు బస్సుయాత్ర
- రాష్ట్రంలో మోగనున్న ఎన్నికల నగారా



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఇప్పటివరకు బీఆర్ఎసను ఢీకొట్టే బాధ్యతను రాష్ట్ర కాంగ్రెసకే వదిలిపెట్టి, మార్గదర్శనానికే పరిమితమైన కాంగ్రెస్ అగ్రనాయకత్వం వచ్చే నెల పూర్తి స్థాయిలో రంగంలోకి దిగనుంది. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నికల సమర శంఖారావం మోగించనుంది. హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించనుంది. ఇప్పటికే మల్లికార్జునఖర్గే,

వివరాలు 2లో..

## మారిషస్ టు భారత్..

అదానీ కంపెనీల్లోకి అక్రమ నిధులు




- మారిషస్, వర్జిన్ ఐలాండ్స్, యూఏఈల్లో డొల్ల కంపెనీలు
- వాటి ద్వారా వందల కోట్ల డాలర్లు
- కృత్రిమంగా షేర్ల ధరల పెంపు
- 800 కోట్ల డాలర్ల నుంచి 26 వేల కోట్ల డాలర్లకు పెరిగిన సంపద
- 2013 నుంచీ అక్రమ లావాదేవీలు
- 2014లోనే తెలిసినా మిన్నకున్న సెబీ
- నాటి సెబీ అధిపతి సిన్హాకు నేడు ఎన్‌డీటీవీలో కీలక పదవి

వివరాలు 2లో..

# కాంగ్రెస్‌లోకి షర్మిల!

- మొదటి పేజి తరువాయి

ప్రతిపాదనలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

**కేసీఆర్ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి: షర్మిల**

శంషాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ సర్కార్‌కు రోజులు దగ్గర పడ్డాయని, ఆయన కుటుంబం తెలంగాణను పూర్తిగా దోచుకుందని, ఇక దోపిడీని ఆపాలని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఢిల్లీలో సోనియా గాంధీని కలిసిన షర్మిల గురువారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ తన కుటుంబం కోసమే తెలంగాణ తెచ్చుకున్నారని అన్నారు. ఆ కుటుంబం నుంచి విముక్తి కలగాలని అన్నారు. తెలంగాణలో జరిగిన అవినీతిని, కాళేశ్వరంలో కేసీఆర్ చేసిన అవినీతిపై పోరాడి ఢిల్లీ వరకూ తీసుకెళ్లింది తానేనన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు జరగాలని, ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి, ఉద్యమాలు చేసిన ప్రజల ఆకాంక్ష నెరవేరాలన్నదే తన కర్తవ్యమని చెప్పారు. తెలంగాణ ఏర్పడినా ప్రజలకు ఫలాలు ఏవీ దక్కడం లేదన్నారు. కాగా, సోనియా ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలికారని తెలిపారు. సోనియా, రాహుల్‌తో భేటీ తర్వాత ఢిల్లీలో షర్మిల మీడియాతో మాట్లాడారు. వారితో నిర్మాణాత్మక చర్చలు జరిగాయని తెలిపారు. 'తెలంగాణ ప్రజలకు మేలు చేసే దిశగా రాజశేఖర్‌రెడ్డి బిడ్డ నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. కేసీఆర్‌కు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది' అని వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ

- మొదటి పేజి తరువాయి

ప్రియాంకాగాంధీ తెలంగాణలో పర్యటించి, చేరికల ద్వారా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టారు. తాజాగా సెప్టెంబరు 16, 17 తేదీల్లో హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం జరపాలని నిర్ణయించారు. సీడబ్ల్యూసీ కార్యవర్గ పునర్ వ్యవస్థీకరణ అనంతరం జరుగుతున్న తొలి సమావేశం ఇదే. ఈ సమావేశం హైదరాబాద్‌లో జరపాలని తెలంగాణ పీసీసీ ప్రతిపాదించి, ఇటీవల అధిష్ఠానానికి లేఖ కూడా రాసింది. ఈ నేపథ్యంలోనే సమావేశం జరుగుతోంది. సోనియా, రాహుల్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, ప్రియాంకాగాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య, అశోక్ గెహ్లాత్, భూపేష్ భాగేల్, సుఖ్విందర్ సింగ్ సుఖు సహా 39 మంది వర్కింగ్ కమిటీ సభ్యులు ఈ సమావేశం కోసం రాష్ట్రానికి వస్తున్నారు.

సీడబ్ల్యూసీ సమావేశం చివరి రోజు సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజు కావడంతో ఆ వేడుకల్లో సోనియాగాంధీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. తెలంగాణ ఏ లక్ష్యం కోసం ఏర్పడిందో, ఎవరి త్యాగాల ఫలితంగా రాష్ట్రం సిద్ధించిందో, రాష్ట్ర ఏర్పాటు కోసం కాంగ్రెస్ చేసిన త్యాగాలేమిటో సోనియా ప్రజలకు వివరించనున్నారు. తెలంగాణ ఏర్పాటులో అత్యంత కీలక పాత్ర పోషించిన సోనియానే హైదరాబాద్ వేదికగా జరిగే కార్యక్రమంలో మాట్లాడనుండటం, ఈ సందర్భంగా కేసీఆర్ వైఖరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉండటంతో రాష్ట్ర రాజకీయంలో ఇదో కీలక పరిణామం అవుతుందని భావిస్తున్నారు. కాగా, బీఆర్ఎస-బీజేపీ మధ్య సంధి కుదిరిందని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పరోక్షంగా బీజేపీ, జాతీయ స్థాయిలో బీజేపీ విజయానికి బీఆర్ఎస్ సహకారం అందించుకుంటాయని, ఇరు పార్టీల మధ్య రహస్య ఒప్పందం కుదిరిందని తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రచారం చేస్తోంది. సెప్టెంబరు 17న కాంగ్రెస్ నేతలు బీజేపీ-బీఆర్ఎస్ రహస్య ఒప్పందం అంశాన్నే ఎజెండాగా చేసుకొని విరుచుకుపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. 18 నుంచి పార్లమెంటు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ కీలక నేతలు ఢిల్లీకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. అయితే, 100 మంది పైగా వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్య నేతలు అదే రోజు తెలంగాణవ్యాప్తంగా పర్యటించి, ఎన్నికల ప్రచారాన్ని మార్మోగించనున్నారు.

**అక్టోబరు 2 నుంచి బస్సు యాత్ర**

అక్టోబరు 2 నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, శాసనసభ పక్ష నేత భట్టి విక్రమార్క, శాసన మండలి పక్షనేత టి.జీవన్‌రెడ్డి, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు కీలక నేతలంతా నెల పాటు బస్సుయాత్ర చేపట్టనున్నారు. డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా... రెండు డజన్ల మందికి పైగా అభ్యర్థులపై నిరసన స్వరాలు వినిపిస్తున్నాయి. జాబితాను ప్రకటించినప్పటికీ బీ-ఫారమ్‌లు వీరందరికీ రావనే ప్రచారం కూడా జరుగుతోంది. అదే క్రమంలో కాంగ్రెస్ కూడా అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్త వహిస్తోంది. బీఆర్ఎసలో టికెట్లు దక్కని అసంతృప్త/కీలక నేతలను చేర్చుకుంటూ... కదన రంగానికి సిద్ధమవుతోంది. కచ్చితంగా గెలవాలనే లక్ష్యంతో పార్టీ అడుగులు పడుతున్నాయి. తెలంగాణ ఇచ్చినప్పటికీ ఆ మేరకు ప్రజల దీవెన లభించలేదని చెబుతూనే.. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచుతూ కొన్ని రోజులుగా ఎండగడుతోంది. ఇప్పటికే ప్రియాంకగాంధీ 'హైదరాబాద్ యూత్ డిక్లరేషన్'ను, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కీలకమైన 'ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్'ను విడుదల చేశారు. వీటికి ఆశించిన స్థాయిలోనే స్పందన వస్తోంది. ఈ క్రమంలో సెప్టెంబరు 16న హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశం బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఎన్నికల యుద్ధానికి నాంది పలకనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, కుంభకోణాలు, అధికార కేంద్రీకరణ, ఫాసిస్ట్ పోకడలనుకాంగ్రెస్ ప్రచారాస్త్రాలుగా చేసుకోనుంది. రానున్న ఎన్నికల్లో పోటీ కాంగ్రెస-బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని పలు సర్వేలు ఇప్పటికే తేల్చాయి. కాంగ్రెస్ అగ్రనాయకత్వం తెలంగాణపై దృష్టి సారించడంతో రాజకీయం రసవత్తరంగా మారనుంది.

**3న పీసీసీ ఎన్నికల కమిటీ భేటీ**

ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సెప్టెంబర్ 3న ఆదివారం గాంధీభవన్‌లో సమావేశం కానుంది. ఆయా అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల నుంచి అందిన దరఖాస్తులను ఈ సమావేశంలో పరిశీలించనున్నారు. నిబంధనల మేరకు అభ్యర్థులు పొందుపరిచిన వివరాలను కమిటీ సరిచూసి నివేదికను రూపొందిస్తుంది. సెప్టెంబర్ 4న ఉదయం 10 గంటలకు టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీ సమావేశమవుతుంది. ఈ సందర్భంగా ప్రదేశ్ ఎన్నికల కమిటీ సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, సభ్యులు వ్యక్తిగతంగా మాట్లాడే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

# మారిషస్ టు భారత్..

న్యూఢిల్లీ, 1: హిండెన్‌బర్గ్ నివేదికను మరువకముందే అదానీ వ్యాపార సామ్రాజ్యంపై మరోసారి పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ఈసారి 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్' (ఓసీసీఆర్‌పీ) అనే అంతర్జాతీయ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుల నెట్‌వర్క్ అదానీ కంపెనీల లావాదేవీలపై ప్రశ్నలు సంధించింది. మారిషసలోని కొన్ని డొల్ల కంపెనీల ద్వారా వందల కోట్ల డాలర్లను భారత్‌లోని అదానీ గ్రూపు సంస్థలకు అక్రమంగా తరలించారని, తద్వారా తమ గ్రూపు ఆస్తుల విలువను అనూహ్యంగా పెంచుకున్నారని అదానీ కుటుంబంపై ఓసీసీఆర్‌పీ ఆరోపణలు గుప్పించింది. 2013 నుంచి 2018 వరకూ తమ గ్రూపు కంపెనీల షేర్ల ధరలను విపరీతంగా పెంచుకునేందుకు ఈ మార్గాన్ని అనుసరించారని తెలిపింది. ఈ మేరకు తమ వద్ద ఆధారాలున్నాయని పేర్కొంటూ గురువారం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండించింది. తమను అప్రతిష్ఠపాలు చేయటం కోసమే పాత ఆరోపణలను మళ్లీ చేస్తున్నారని ప్రకటించింది. అయితే, ఓసీసీఆర్‌పీ నివేదిక నేపథ్యంలో అదానీ గ్రూపు సంస్థల షేర్ల ధరలు గణనీయంగా పతనమయ్యాయి.

**ప్రమోటర్ల వాటా 75 శాతానికి మించరాదు**

సెబీ నిబంధనల ప్రకారం, ఒక కంపెనీ ప్రమోటర్లు ఆ కంపెనీలో 75 శాతం వాటాలను మాత్రమే కలిగి ఉండాలి. మిగిలిన 25 శాతం వాటాలను బహిరంగంగా షేర్‌మార్కెట్లో అందుబాటులో ఉంచాలి. కానీ, అదానీ కుటుంబం ఈ నిబంధనను ఉల్లంఘించి తమకు చెందిన వ్యక్తుల ద్వారా తమ కంపెనీల్లో 75 శాతానికి మించి వాటాలను కొనేసిందని, తద్వారా షేర్‌మార్కెట్‌లో తమ కంపెనీ షేర్ల కృత్రిమ కొరతను సృష్టించి, డిమాండును పెంచి, వాటి ధరలను పెంచేసిందని ఓసీసీఆర్‌పీ ఆరోపణ. ఈ అక్రమ లావాదేవీలు ఎలా జరిగాయన్నదానిపై వివరాలను కూడా తన నివేదికలో వెల్లడించింది. దాని ప్రకారం.. అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ అన్న వినోద్ అదానీకి సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులు ఈ అక్రమ లావాదేవీలలో కీలకపాత్ర పోషించారు.

వారిలో ఒకరు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన నాజర్ అలీ షాబాన్ అహ్లి కాగా మరొకరు తైవాన్‌కు చెందిన చాంగ్ చుంగ్ లింగ్. 2010 నాటి కొన్ని పత్రాల ప్రకారం, అదానీ కంపెనీలకు డైరెక్టర్లుగా కొనసాగుతున్న నాజర్ అలీ, చాంగ్ చుంగ్.. మారిషస్, బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో డొల్ల కంపెనీలను నెలకొల్పారు. వీరు ఏర్పాటు చేసిన నాలుగు డొల్ల కంపెనీల ద్వారా బెర్ముడాలోని గ్లోబల్ అపార్చునిటీస్ ఫండ్ (జీఓఎఫ్)లోకి వందల కోట్ల డాలర్లు ప్రవహించాయి. సదరు ఫండ్ నుంచి భారత్‌లోని అదానీ కంపెనీల్లోకి నిధులు మళ్లాయి. ఇదంతా 2013 నుంచి మొదలైంది. జీఓఎఫ్ నుంచి దాని అనుబంధ సంస్థలైన ఎమర్జింగ్ ఇండియా ఫోకస్ ఫండ్స్, ఈఎం రిసర్జెంట్ ఫండ్‌లకు కూడా నిధులు భారీ ఎత్తున తరలి వెళ్లాయి. ఈ రెండు సంస్థలు తిరిగి అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్, అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్ కంపెనీల షేర్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి. నాజర్, చాంగ్ కొనుగోళ్ల ఫలితంగా అదానీ షేర్ల ధరలు 2013-18 మధ్యకాలంలో అనూహ్యంగా పెరిగిపోయి భారతదేశంలోనే అత్యంత సంపన్న, అతిపెద్ద వ్యాపారసంస్థగా అదానీ గ్రూపు ఎదిగింది. నాజర్, చాంగ్‌లకు అదానీ కుటుంబం నుంచే డబ్బులు వెళ్లాయా అన్నది స్పష్టంగా తేలకపోయినా, అదానీ కంపెనీ షేర్ల వ్యాపారం అదానీ కుటుంబం సమన్వయంతోనే జరిగినట్లు తెలుస్తోందని ఓసీసీఆర్‌పీ పేర్కొంది. ఈ విధంగా అదానీ కంపెనీల షేర్ల ధరలు విపరీతంగా పెరిగిపోవటం వల్ల అదానీ గ్రూప్ సంపద అనూహ్యంగా పెరిగింది. 2013లో 800 కోట్ల డాలర్లు ఉన్న సంపద గత ఏడాదికి 26,000 కోట్ల డాలర్లకు చేరుకోవటమే దీనికి నిదర్శనం అని ఓసీసీఆర్‌పీ తెలిపింది. మారిషసలోని రెండు ఫండింగ్ ఏజెన్సీలను వినోద్ అదానీకి చెందిన ఒక ఉద్యోగి ఓ దుబై కంపెనీ ద్వారా పర్యవేక్షించేవారని ఓసీసీఆర్‌పీ పేర్కొంది. 'అదానీ గ్రూపు షేర్లకు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద లావాదేవీల గురించి 2014లోనే సెబీకి కొన్ని ఆధారాలు లభించాయి. ఆ సమయంలో సెబీ అధిపతిగా యూకే సిన్హా ఉండేవారు. ఆయన ప్రస్తుతం అదానీ సొంతం చేసుకున్న ఎన్డీటీవీ డైరెక్టర్, చెయిర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు' అని తెలిపింది.

# నెలాఖరుకల్లా సీట్ల సర్దుబాటు!

- మొదటి పేజి తరువాయి

కలిసి ఉమ్మడిగా చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాల గురించి, కనీస ఉమ్మడి కార్యక్రమ రూపకల్పనపైన శుక్రవారం భేటీలో చర్చించనున్నారు. 28 పార్టీలకు చెందిన 63 మంది ప్రతినిధులు గురువారంనాటి భేటీకి హాజరుకాగా వారిలో పలువురు నేతలు ముందస్తు ఎన్నికల ఊహాగానాల నేపథ్యంలో సీట్ల సర్దుబాటును వీలైనంత త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడినట్లు సమాచారం. తుది నిర్ణయం ఆధారంగా అన్ని పార్టీల రాష్ట్ర కమిటీలూ సీట్ల సర్దుబాటు ఫార్ములాను అమలు చేయనున్నాయి. అలాగే శుక్రవారం భేటీ అనంతరం.. కూటమిలోని ప్రధాన పార్టీలకు చెందిన 11 మంది నేతలతో కో-ఆర్డినేషన్ కమిటీని ప్రకటించడంతోపాటు కూటమి లోగోను ఆవిష్కరించే అవకాశం ఉంది. కాగా..ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించేందుకే తామందరం చేతులు కలిపామని.. అధికార బీజేపీని గద్దె దించేందుకు అవసరమైన ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందిస్తామని ఈ సమావేశంలో పాల్గొన్న విపక్షాల నాయకులు పేర్కొన్నారు. ఇండియా కూటమి భేటీ శుక్రవారం కూడా కొనసాగనుంది.

**ప్రమాదంలో సమాఖ్య భావన..**

దేశ సమైక్యతను, సార్వభౌమాధికారాన్ని బలోపేతం చేసి, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ప్రస్తుతం ఉందని ఈ భేటీకి హాజరైన బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ అభిప్రాయపడ్డారు. పేదరికం, నిరుద్యోగం, రైతుల సంక్షేమం అంశాల్లో మోదీ సర్కారు విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో తామంతా కలిసి మోదీ సర్కారుకు వ్యతిరేకంగా ఒక ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందిస్తామని లాలూ తెలిపారు. ఎన్నికల్లో బీజేపీపై విపక్షాలన్నీ కలిసి ఒకే అభ్యర్థిని నిలబెడతామన్నారు. దేశంలో సమాఖ్య భావన ప్రమాదంలో పడిందని, బీజేపీయేతరపాలిత రాష్ట్రాలను కేంద్రం తీవ్రంగా వేధిస్తోందని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆగ్రహం వెలిబుచ్చారు. ఇండియా కూటమిని బీజేపీ ద్వేషించడమే కాక.. ఎక్కడ విజయం సాధిస్తుందో అని భయపడుతోందని, 'ఇండియా' అనే పదాన్నే ద్వేషి స్తూ చివరికి ఆ పదాన్ని ఉగ్రవాద సంస్థల పేర్లతో పో లుస్తోందని ఆమ్ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా మండిపడ్డారు. దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు ఇండియా కూటమి కృషి చేస్తోందని ఆర్జేడీ నేత మనోజ్ ఝా అన్నారు. తమది కేవలం 'పార్టీల కూటమి' కాదని.. 'ఆలోచనల కూటమి' అని ఆయన పేర్కొన్నారు.

దేశానికి సాంత్వన.. దేశ పునర్నిర్మాణానికి తమ కూటమి అవసరమని మనోజ్ స్పష్టం చేశారు. ఇండియా కూటమికి ప్రజల నుంచి వస్తున్న స్పందన.. ప్రధానిని, బీజేపీని నిస్త్రాణకు గురిచేస్తున్నట్టు సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారామ్ ఏచూరి వ్యాఖ్యానించారు. మోదీ సర్కారు విధానాల వల్ల ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగిపోయా యని.. ఆ విధ్వంసాన్ని సరిచేసే సవాల్ ఇండియా కూటమి ముందుందని ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే అన్నారు. ఈ భేటీ అనంతరం శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే.. కూటమి నేతలకు విందు ఇచ్చారు. ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని.. ఇండియా కూటమి ఆ ప్రత్యామ్నాయాన్ని వారికి ఆఫర్ చేస్తోందని తేజస్వీ అన్నారు. సమాజాన్ని విభజించేవారికి తాము తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. కూటమి భేటీకి ముందు కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ శివసేన (ఉద్ధవ్ వర్గం) నేతలైన ఆదిత్య ఠాక్రే, సంజయ్‌రౌత్, ఎన్సీపీ నేతలు సుప్రియా సూలే, జయంత్‌పాటిల్‌తో ముచ్చటించారు. మరోవైపు.. ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్‌పవార్‌తో కాసేపు మాటలు కలిపారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, బిహార్ సీఎం నీతీశ్‌కుమార్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, రాష్ట్రీయ జనతాదళ్ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్రీయ లోక్‌దళ్ చీఫ్ జయంత్ చౌదరి తదితర హేమాహేమీలతో భేటీ సందడిగా మారింది.

## మోదీజీ.. ఇప్పటికైనా మాట్లాడండి!

- మొదటి పేజి తరువాయి

భారత్ నుంచి తరలి వెళ్లింది... వివిధ మార్గాల్లో ఆ డబ్బు మళ్లీ తిరిగివచ్చిందని కథనాల్లో పేర్కొన్నారని రాహుల్ తెలిపారు. ఆ డబ్బు ఎవరిది... అదానీదేనా... లేక ఇతరులదా? అని ప్రశ్నించారు. పెట్టుబడులతో అదానీ గ్రూపు షేర్ల ధరలు కృత్రిమంగా పెంచారని, షేర్ల పెరుగుదల సొమ్ముతో అదానీ పోర్టులు, ఎయిర్ పోర్టుల వంటి ఎన్నో ఆస్తులు కొన్నారని ఆరోపించారు. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ అక్రమాల మాస్టర్ మైండ్ అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నాసర్ అలీ, ఛాంగ్ చుంగ్ లింగ్ దీని వెనుక ఉన్నట్టు కథనాలు వచ్చాయని అన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలపై అదానీ గ్రూప్ నకు సెబీ క్లీన్ చిట్ ఇచ్చిందని, అదానీకి క్లీన్ చిట్ ఇచ్చిన వ్యక్తి ఇప్పుడు ఎన్డీటీవీలో డైరెక్టర్ గా ఉన్నాడని వెల్లడించారు. "అదానీ గ్రూప్ లో ఏదో జరుగుతోందని అర్థమవుతోంది. భారతదేశానిది పారదర్శక ఆర్థిక వ్యవస్థ అని ప్రపంచానికి చెబుతున్నాం. మరి ఈ కుంభకోణంపై ఎందుకు విచారణ జరిపించరు? అదానీ గ్రూప్ అంశంపై జేపీసీ విచారణకు ఎందుకు అనుమతించరు? విచారణ కోసం ప్రధాని ఎందుకు చొరవ తీసుకోవడంలేదు? కుంభకోణాలకు పాల్పడేవారిని ఎందుకు ఉపేక్షిస్తున్నారు?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మరి కొన్నిరోజుల్లో ఢిల్లీలో జీ-20 సమావేశం జరగబోతోంది. జీ-20 సదస్సులో అదానీ గ్రూప్ అంశంపై విదేశీ నేతలు ప్రశ్నిస్తే ఏం సమాధానం చెబుతాం? అదానీ గ్రూప్ ఎందుకు అంత ప్రత్యేక సంస్థగా మారింది. దేశ ఆర్థిక వ్యవస్థపై స్వారీ చేసేందుకు అదానీ గ్రూప్ ను ప్రధాని ఎందుకు అనుమతిస్తున్నారు?" అంటూ తీవ్ర విమర్శలు చేశారు.

## మాదాపూర్‌లో డ్రగ్స్ కలకలం

**హైదరాబాద్ :** హైదరాబాద్ లో మరోసారి రేవ్ పార్టీ కలకలం రేపింది. మాదాపూర్ లోని విఠల్ రావు నగర్ లో ఉన్న వైష్ణవి అపార్ట్ మెంట్ లో రేవ్ పార్టీ జరిగింది. ఈ రేవ్ పార్టీని భగ్నం చేసిన నార్కోటిక్

బ్యూరో పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో సినీ ఫైనాన్సియర్ వెంకట్, కె.వెంకటేశ్వర రెడ్డి, డి. మురళితో పాటు ఇద్దరు యువతులు మధుబాల, మేహక్ ఉన్నారు. యువతులను ఢిల్లీకి చెందిన వారిగా గుర్తించారు. పట్టుబడిన వారి నుంచి కొకైన్, ఎల్ఎస్డీ, గంజాయితో పాటు రూ. 70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నార్కోటిక్ పోలీసులు వెంకట్ కదలికలపై మూడు నెలలుగా నిఘా పెట్టారు. గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్ లో రేవ్ పార్టీలను నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. వెంకట్ వాట్సాప్ చాట్ పరిశీలించారు. డ్రగ్స్ మాఫియాతో వెంకట్ కు గల సంబంధాలపై ఆరా తీస్తున్నారు

## సీఎం కేసీఆర్‌కు రాఖీ కట్టిన తోబుట్టువులు

- మొదటి పేజి తరువాయి

చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రక్షాబంధన్ వేడుకలు ప్రగతి భవన్ లో ఈరోజు ఘనంగా జరిగాయి. తోబుట్టువుల ప్రేమా నురాగాలు, అనుబంధాలకు ప్రగతి భవన్ ముఖ్యమంత్రి నివాసం వేదికయింది.మరోవైపు రాఖీ పండగ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎమోషనల్ ట్వీట్ చేశారు. అమ్మలోని మొదటి అక్షరం 'అ', నాన్నలోని చివరి అక్షరం 'న్న' కలిపితే నా 'అన్న' అంటూ మంత్రి కేటీఆర్‌తో ఉన్న ఫొటోను కవిత ట్వీట్ చేశారు. ఇక మంత్రి కేటీఆర్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ కు కవిత రాఖీ కట్టారు.

## రేపటి నుంచి తెలంగాణలో ఉపాధ్యాయుల బదిలీలు

టీచర్ల బదిలీలపై జనవరిలోనే షెడ్యూల్ విడుదలైంది. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఇన్నాళ్లు జాప్యం జరిగింది. ఇటీవలే న్యాయస్థానం స్టే ఎత్తివేయడంతో బదిలీలకు అవరోధాలు తొలగిపోయాయి.

## ఖర్గే, అమిత్ షా టూరిస్టుల్లా వచ్చి వెళ్లారు

- మొదటి పేజి తరువాయి

నినాదాలు ఇచ్చే పార్టీలు కొన్ని ఉంటాయని, నినాదాలను నిజం చేసే పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత యాతాకుల భాస్కర్ ఈ రోజు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. "ఖర్గే, అమిత్ షా టూరిస్టుల్లా వచ్చి వెళ్లారు. బీజేపీ స్థానిక నేతలు ఇచ్చిన స్క్రిప్టును చదివి అమిత్ షా వెళ్లిపోయారు. అమిత్ షా సొంత రాష్ట్రం గుజరాత్‌లో పగలు కూడా కరెంటు ఉండట్లేదు. అక్కడి గుడ్డి పాలనను సరి చేయలేరు కానీ.. ఇక్కడ డ్రామాలు చేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ నకిలీ, వెకిలి హామీలు ఇస్తున్నాయని మండిపడ్డారు. నకిలీ డిక్లరేషన్లు ఇస్తే ప్రజలు నమ్మరన్నారు. ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటకలో అలవికాని హామీలు ఇచ్చి చతికిలపడ్డారని అన్నారు. అక్కడ బీజేపీపై వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్‌కు అవకాశం వచ్చిందని చెప్పారు.

## అన్న కేటీఆర్ ను ఉద్దేశించి కవిత భావోద్వేగ ట్వీట్


**ప్రస్తుతం అమెరికాలో ఉన్న కేటీఆర్**

**అన్నకు రాఖీ కట్టలేకపోయిన కవిత**

**అమ్మలోని మొదటి అక్షరం, నాన్నలోని చివరి అక్షరం నా 'అన్న' అని ట్వీట్**

**హైదరాబాద్** : రక్షా బంధన్ సందర్భంగా తన అన్న కేటీఆర్ ను ఉద్దేశించి ఎమ్మెల్సీ కవిత భావోద్వేగమైన ట్వీట్ చేశారు. అమ్మలోని మొదటి అక్షరం, నాన్నలోని చివరి అక్షరం నా 'అన్న' కేటీఆర్ అని ఆమె అన్నారు. తన అన్న తనను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్న ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం కేటీఆర్ కుటుంబ సమేతంగా అమెరికాలో ఉన్నారు. దీంతో, ఈ ఏడాది తన అన్నకు ఆమె రాఖీ కట్టలేక పోయారు. ఈ నేపథ్యంలో ఆమె ఎమోషనల్ గా ట్వీట్ చేశారు. తన కజిన్, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కు కవిత రాఖీ కట్టారు.

# వివాహవేడుకల్లో పాల్గొన్న రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు



**కనిగిరి శుభ తెలంగాణ :**హనుమంతుని పాడు మండలం ఉమ్మన పల్లి,వెంగపల్లి గ్రామాల్లో వివాహ వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి , నందనవనం ఎంపీటీసీ సూరిశెట్టి స్వామి, హెచ్ ఎం పాడు ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి హనుమంతాపురం ఎంపీటీసీ ,తాని గుండాల తిరుపతిరెడ్డి, తురకపల్లి సర్పంచ్ మారం రవీంద్రారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కత్తి తిరుపాలు ,కత్తి కిషోర్, చైతన్య, నాని తదితరులు పాల్గొన్నారు.

# దొరువు అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



**కనిగిరి ఆగస్ట్31 శుభ తెలంగాణ :**కనిగిరి పట్టణంలోని దొరువు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. గురువారం దొరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. దొరువు వద్ద పూడికతీత పనులు, రోడ్లు, ఫెన్సింగ్, లైటింగ్ ఏర్పాటు పనులను పరిశీలించి కాంట్రాక్టర్ మరియు మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ సహకారంతో కనిగిరి పట్టణంలోని చారిత్రక దొరువు ప్రాంతాన్ని రూ .2 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయదలిచామని,అందులో భాగంగా మొదటి దశలో రూ.50 లక్షల వ్యయంతో పనులను శరవేగంగా చేపడుతున్నట్లు తెలిపారు. దొరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలను అలంకరించి, పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని.కనిగిరి పట్టణ ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో రూపుదిద్దుకోనున్న దొరువు ప్రాంతంలో కుటుంబ సభ్యులతో సహా వచ్చి ఆనందంగా గడిపే విధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. కనిగిరి పట్టణానికి మణిహారంలా దొరువు ప్రాంతం నిలిచిపోయే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అరుణోదర్, ఇంచార్జీ సానిటరీ ఇన్స్పెక్టర్ చెన్నకేశవులు, వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫుదీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు....



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 31 శుభ తెలంగాణ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి సందర్బంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డికి రాఖీలు కట్టిన నియోజకవర్గ అక్కాచెల్లెళ్లు అనంతరం హన్మంతన్న మాట్లాడుతూ అన్నాచెల్లెళ్లు. అక్కా తమ్ముళ్ల మధ్య ఆప్యాయత ఎన్నేళ్లయినా చెక్కు చెదరకుండా ఉండే బంధమే రక్షా బంధన్ అన్న చెల్లెళ్ల, అక్క తమ్ముళ్ళ ఆత్మీయ బంధాన్ని తెలిపే రక్షా బంధన్ పండుగను మహిళా కాంగ్రెస్ నాయకుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందోత్సావం అని తెలిపారు. రాఖీ కట్టిన ప్రతి ఒక్క ఆడపడుచులకు
రైస్ కుక్కర్ కానుకగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మరియు మహిళా కాంగ్రెస్ నాయకులు బారి ఎత్తున్న పాల్గొన్నారు.

# అన్నా చెల్లెలి అనుబంధం అది జన్మజన్మల సంబంధం



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :**రాఖీ పండుగ అంటేనే అను బంధాలకు ప్రతీక. తమ సోదరులకు తోబుట్టువులు రాఖీ కట్టి ఈ అనుబంధం కలకాలం కొనసాగాలని కోరుకుంటారు. ఒకరికొకరు ఆశీర్వాదం తీసుకొని కమ్మటి తీపిదనంతో నోరు తీపి చేసుకుంటారు. అమ్మలోని మొదటి అక్షరం “అ”అని నాన్న లోని చివరి అక్షరం” న్న”అని ఈ రెండు అక్షరాలను కలిపితేనే వచ్చేది (అన్న) అనే అనుబంధమని ఈ వాక్యానికి అర్థం చెబుతుంది. అలాంటి ఇటీవల కాలంలో ఉరుకులు పరుగుల జీవితంలో ఈ అన్నాచెల్లెళ్ల అనుబంధం అనే పదాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వకుండా సంపాదించాలనే కోరికతో ఈ విలువకు ప్రాముఖ్యం తగ్గింది. సంవత్సరానికి ఒక రోజు వచ్చే ఈ రాఖీ పౌర్ణమి రోజు మాత్రం అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్లు కలుసుకొని తమ ప్రేమానురాగాలను పంచుకోవడం జరుగుతుంది.

# గాస్పల్ టి.వి ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రం కొరకు “ప్రేయర్ ఫర్ ఇండియా “సేయింట్ పీటర్ లూతరన్...

- చర్చ్, విజయవాడ లో ప్రత్యేక ప్రార్ధన...
- మణిపూర్ క్రైస్తవులపై హత్యాచారం, హత్యలకు వ్యతిరేకంగా, ..
- మణిపూర్ క్షేమం కోరుతూ ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ నాయకులు, పాస్టర్స్ ప్రత్యేక ప్రార్ధనలు.
- దేశం లో మైనారిటీలకు రక్షణ లేకుండా పోయింది...
- తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు.బిషప్ దుర్గం ప్రభాకర్



**శుభ తెలంగాణ :**సేయింట్ పీటర్ లూతరన్ చర్చ్, విజయవాడ నందు గాస్పల్ టి. వి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ క్రైస్తవులు, పాస్టర్స్, బిషప్స్ ఐక్యతగా పాల్గొని మణిపూర్ లో దాడులను హారికట్టాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశం లో తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ మణిపూర్ దాడులలో, అత్యాచార పర్వంలో నగ్నంగా ఊరేగింది బిజెపి కేంద్ర,రాష్ట్ర పాలకుల ఆర్.యస్.యస్ వికృత,విద్వేష రూపాలకు నిదర్శనం అనీ,మణిపూర్ మండుతోంది.కుకీ ఆదివాసీ ప్రజలపై మేహితీలు భయంకరమైన దాడులు సాగుతున్నాయి అనీ తప్పుడు ప్రచారం చేస్తున్నారు, కానీ క్రైస్తవులను చర్చ్ లను పాస్టర్స్ ను టార్గెట్ చేసి చంపిస్తున్నారని .ఇది ముమ్మాటికీ బి జె పి, ఆర్. యస్.యస్ కార్యకర్తలదే అనీ, కేంద్ర ప్రభుత్వం శాంతి నెలకొల్పలని భారత దేశ ప్రజలందరూ కోరుతున్నారని అన్నారు.ఊళ్ళకి ఊళ్ళు కాలి బూడిద కుప్పలయ్యాయి.వేలాది మంది ఇళ్ళు,జీవనోపాధి కోల్పోయి,దిక్కు తెలియని స్థితిలో,నడిరోడ్డున నిలబడ్డారు. పునరావాస కేంద్రాల్లో జీవచ్ఛవాల్లా బతికి వున్నారు.మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వాల,ప్రోత్సాహంతో నెలల తరబడి సాగుతోన్న ఈ హింసాకాండ – మే 4 ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావటంతో దేశం మొత్తం కళ్ళముందు కొచ్చిందనీ, మణిపూర్ రాష్ట్రంలో మైదాన ప్రాంతంలో మెజారిటీగా వుండే మెయితీలకు ఆదివాసీ హోదా కల్పిస్తామని బిజెపి రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందనీ .ఈ చర్యతో వారు అడవి ప్రాంతంలో నివసించే కుకీ తదితర ఆదివాసులకు మెయితీలకు మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టారనీ.
ఈ గొడవలకు ముందే అడవులను రిజర్వు ఫారెస్టుగా ప్రకటించి,అడవుల పరిరక్షణ పేరిట కొన్నిచోట్ల అడవుల నుండి ఆదివాసీ ప్రజల్ని గెంటి వేశారు.దీన్ని నాగా,కుకీ ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకించారు.దీన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా,అటవీ సంపదను,ఖనిజ వనరులను కార్పొరేట్లకు,కట్టబెట్టే కుట్రతో మణిపూర్ రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజలపై ముఖ్యం గా క్రైస్తవులను టార్గెట్ చేసి విద్వేషపూరిత దాడులను జరిపిస్తున్నారని హిందూ మెయితీలు క్రైస్తవులైన కుకీలను తరిమికొట్టడంగా బాధాకరం అనీ. ప్రభుత్వ యంత్రాంగం,రాజకీయ నాయకులు అందిస్తున్న అండదండలతో అల్లరిమూకలు మరింత పెచ్చరిల్లి పోతున్నారని.2023,మే 4న జరిగింది ఇదే.మణిపూర్లోని కాంగ్పాక్పీ జిల్లాలోని బి.ఫైనోమ్ గ్రామంపైకి వెయ్యి మంది మెయితీలు గుంపుగా విరుచుకు పడ్డారు.ఇళ్ళు తగుల బెట్టారు.డబ్బు, వస్తువులు,సరుకులు దోచుకున్నారు.గ్రామస్తులు ప్రాణాలు అరచేత పట్టుకొని అడవుల్లోకి పారిపోగా మిగిలిన జనాన్ని విపరీతంగా కొట్టారు.
ఇద్దరు మహిళలను (ఒకరికి 20 ఏళ్ళు,మరొకరికి 40 ఏళు ళ్ళ) దొరకబుచ్చుకొని ‘మా చేతిలో చావు తప్పించుకోవాలంటే బట్టలిప్పు’మని బెదిరించి,వారిని నగ్నంగా రెండు కిలోమీటర్లు నడిపించి ఊళ్ళోకి తెచ్చారనీ,దారి పొడుగునా చెప్ప వీల్లేని విధంగా,అత్యంత అమానుషంగా,జుగుప్సా కరంగా,భయంకరంగా వారిని హింసిస్తూ వీధుల్లో ఊరేగించారనీ.
ఇంకా దగ్గర్లోని పొలాల్లోకి ఈడ్చుకెళ్ళి కొన్ని గంటల పాటు పదుల మంది అత్యాచారం చేశారు.వారిలో ఇరవై ఏళ్ళ యువతి యొక్క తండ్రినీ,తమ్ముడినీ కూడా ఆమె కళ్ళముందే చంపేశారనీ,ఆ ఘటనకు సంబంధించి తీసిన వీడియో రెండున్నర నెలల తర్వాత బైటికి వచ్చిందనీ.దీంతో మణిపూర్లో సాగుతున్న హింసాకాండ దేశ ప్రజలందరి ముందు బట్టబయలయింది.ఇంత కాలంగా కుకీ ప్రజల ప్రాణాలపై,స్త్రీలపై, ఆవాసాలపై,చర్చిలపై మెయితీ హంతక ముఠాలు బహిరంగంగా సాగిస్తున్న దాడులకు,హింసాకాండకు మొత్తం అధికార యంత్రాంగం,పోలీసులు, మిలటరీ పాలకవర్గ రాజకీయ నాయకులు,సాయుధ బలగాలు మద్దతునిస్తూ ఆదివాసీ క్రైస్తవ జాతుల నాశనానికి పూనుకొన్నారనీ అన్నారు.
వందలాది గ్రామాలపై దాడులు చేశారు.అక్కడ జరుగుతున్న ఈ దుర్మార్గం బైటి ప్రపంచానికి తెలియకుండా వుండటం కోసం మణిపూర్ ప్రభుత్వం ఇంటర్నెట్ని ఆపేసింది.చివరికి ఈ వీడియో బైటికి వచ్చి వైరల్ అయ్యిందనీ ఇప్పుడు కూడా ప్రధాని ఈ విధ్వంస హింసాకాండను ఆపడానికి చర్యలు తీసుకోకుండా,ఈ ఘటన తనకు అపారమైన వేదన కలిగించిందని నిస్సహాయులైన సగటు మనిషి వలె ప్రకటించి ఆక్రోశించటం,ఆదివాసీ మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అసలు ఈ సంఘటనపై నోరు విప్పక పోవటం,మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఇదొక్కటే కాదు,వందల ఘటనలు జరిగాయని చెప్పటం,దేన్ని సూచిస్తోంది?జరిగిన దుర్మార్గాన్ని తేలిక చేసి బాధితుల ఆగ్రహాన్ని అపహాస్యం చేయటం కాదా ! ప్రజల వేదనకి వీసమెత్తయినా విలువనివ్వని అపరిమిత అహంకారం కాదా! దీనిని శాంతి భద్రతల సమస్యగా ప్రచారం చేస్తూ మణిపూర్ ఆదివాసీ ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించకుండా నిరంతరం ఘర్షణలకు దారితీయడం కాదా !మణిపూర్ నిండా( జనాభాకి మించి) మోహరించి వున్న పోలీసులు,సాయుధ బలగాలు ఈ హింసను,దౌర్జన్యాన్ని అడ్డుకోవడంలో ఎక్కడున్నాయి?మతతత్వాన్ని, రెచ్చగొడుతూ,వందలాది మంది మూకగా దాడులు చేస్తూంటే,బాధితుల హాహాకారాలూ,ఆగ్రహ జ్వాలలలో మణిపూరే అట్టుడికి పోతోంది.మరోవైపు బిజెపి,%=ూా% మాత్రం ఈ తరహా విశ్వాసాలను దేశమంతటా ఆరని చిచ్చులా రగిలించడానికి పథకాలు పన్నుతున్నారనీ .రేపు పాలకులు హడావుడిగా తెస్తామని చెప్తున్న యూనిఫామ్ సివిల్ కోడ్’ తదితర చట్టాలన్నీ ప్రజల మధ్య శత్రుత్వాలను పెంచి అగాధాలను సృష్టించడానికే ఉపయోగించనున్నారనీ .ఈ కుట్రలను అన్ని వర్గాల పజలు కలిసి ఐక్యంగా తిప్పికొడదాం.ఏ ప్రాంత ప్రజలైనా,ముఖ్యంగా యువత తగిన సామాజిక చైతన్యంతో,స్త్రీల పట్ల బాధ్యతతో గౌరవంగా వ్యవహరించే విలువల వ్యాప్తికి విస్తారంగా కృషి చేయాలి.ప్రజల మధ్య వైరుధ్యాలను విద్వేషాలుగా రెచ్చగొట్టి తమ దోపిడీ,అధికార ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్న పాలకవర్గాల కుట్రలను ఎండగడదాం అన్నారు.ఈ కార్యక్రమంలో గాస్పల్ టివి డైరెక్టర్ శామ్యూల్ బొజ్జ,హోస్ట్ దండల దేవసహాయం, అల్లూరి విశ్వప్రసాద్,డా ముల్లంగి జాకబ్ రాజు, పాస్టర్ సంజయ్ వెంపటి హైదరాబాద్ , పాస్టర్ ఇమ్మానియెల్ హైదరాబాద్ , బిషప్ మొగులూరి ఎలీషా, పాస్టర్ తిమోతి కరీంనగర్, బీర రాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్న చెల్లెల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



**శుభ తెలంగాణ :**ఈరోజు అడ్డగుడుర్ మండలం రాపాక గ్రామంలో మోత్కూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ గారికి వారి చెల్లెలు యాకమ్మ మరియు స్రవంతిలు రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టి స్వీట్ తినిపించడం జరిగింది.ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ రాఖీ పండుగ అనేది అన్న చెల్లెల అనుబంధానికి ప్రతీక అని తొడ బుట్టిన వారు కష్ట సుఖాల్లో కలిసి మెలిసి ఉండాలని ఈ సంప్రదాయం కొనసాగించాలని అన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

- పలు కుటుంబాలకు ఆర్థిక సహాయాలు అందించి ఆదుకుంటున్న కాంగ్రెస్ నేత
- మనసున్న మహారాజుగా పేరున్న పంజాల రామాంజనేయులు గౌడ్



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :**వలిగొండ మండల పరిధిలోని మొగిలి పాక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగిలిపాక పాపయ్య తల్లి మొగిలి పాక మల్లమ్మ ఇటీవల మరణించడం జరిగింది. ఈ మరణ వార్త తెలిసిన కాంగ్రెస్ పార్టీ భువనగిరి నియోజకవర్గం ఇంచార్జ్ పంజాల రామాంజనేయులు గౌడ్ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మొగిలిపాక గ్రామ శాఖ ఆధ్వర్యంలో 10000రూపాయలు ఆర్థిక సహాయం అందజేసారు.అదే విధంగా అనారోగ్యం తో బాధపడుతున్న ఇదే గ్రామానికి చెందిన చలిచీమల స్వామి కి 5000 రూపాయలు, మరియు ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురై మరణించిన బోల్లుల నర్సింహా కుటుంబాన్ని పరామర్శించి 5000రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పబ్బు ఎల్లయ్య గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిడి సత్తిరెడ్డి ,యాస అంజిరెడ్డి,రచ్చ యాదగిరి,నరేందర్ చారి, జదిగే నర్సింహా మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్ తో గేదె మృతి



**శుభ తెలంగాణ :**బిక్కేరువాగులో పశువుల మేతకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు నేలపై పరిచిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన అడ్డగూడూరు మండల పరిధిలో జరిగింది. పూర్తి వివరాలిలా ఉన్నాయి. చిర్రగూడూరు గ్రామానికి చెందిన రైతు ఉప్పుల అవిలేను రోజు మాదిరిగానే పశువుల మేతకు తన గేదెలను బిక్కేరు వాగులోకి తోలుకుపోయాడు. అయితే గేదె నీరు తాగుతుండగా వ్యవసాయ బోర్లకోసం వాగులో పరిచిన విద్యుత్ తీగలు తగిలి సుమారు 50 వేల విలువ చేసే పాడిగేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు అవిలేను రోదిస్తూ తెలిపాడు. తనకు విద్యుత్ అధికారులు పై అధికారులకు తెలియచేసి నష్టపరిహారం చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకొని,న్యాయం చేయాలని కోరారు.

# కోటి మొక్కలు నాటడమే ఆకాష్ ప్రజా ఫౌండేషన్ అంతిమ లక్ష్యం: దుబ్బాక ఆకాష్ రెడ్డి

- ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించాలి
- సగటు మనిషి కచ్చితంగా ఐదు మొక్కలు నాటాలి



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :**ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం కోటి మొక్కలు నాటడమే తమ ఆకాశ ఫౌండేషన్ అంతిమ లక్ష్యమని ఆకాష్ ప్రజా ఫౌండేషన్ చైర్మన్ దుబ్బాక ఆకాష్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో గురువారం రాఖీ పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల భాగస్వామ్యం సమిష్టి బాధ్యత తోనే పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుందని అన్నారు. పెరుగుతున్న కాలుష్యంతో పర్యావరణం కాలుష్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ద్వారా ఎంతో కృషి చేస్తుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే తమ ఆకాష్ ప్రజా ఫౌండేషన్ ద్వారా కోటి మొక్కలు నాటడమే తమ లక్ష్యంగా భావిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా కనీసం ఐదు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పచ్చని మొక్కలతో నింపేయాలని ఉద్బోధించారు. మనం తినే ఆహారం ,పీల్చేగాలి, త్రాగే నీరు ,నివసించడానికి అనువుగా ఉన్న భూమి ప్రకృతి ప్రసాదాలని అన్నారు. అనుక్షణం తనను వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్న తన తల్లిదండ్రులకు, మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉద్యమ కళాకారులను విస్మరించిన ప్రభుత్వం

- ఉద్యమ కాలంలో పాటకు ప్రాణం పోసిన కళాకారులు యాది లేరా
- ఓ ఉద్యమ కళాకారుని ఆవేదన
- ఇకముందు అయినా మమ్మల్ని గుర్తించి ఉద్యోగాలు ఇప్పించండి



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :**వలిగొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమ కళాకారుడు వేముల హరిక్రిష్ణ మాట్లాడుతూ తాను ఆవేదనను వ్యక్తం చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కాలికి గజ్జె కట్టి భుజాన గొంగడేసి రాత్రింబవళ్లు అనేక స్టేజీల మీద ధూమ్ ధామ్ సభలలో తమ ఆటపాటలతో ఉద్యమాన్ని ఉగ్రూతలూగించి సబ్బండ జాతులను ఏకతాటి మీదికి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకమైన భూమిక పోషించినటువంటి కళాకారులను ఈ ప్రభుత్వం విస్మరించింది....తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మన బ్రతుకులు మారుతాయి అనుకున్న కళాకారుల జీవితాల్లో ఇంకా చీకట్లు కమ్ముకున్నాయి తప్ప మా జీవితాలు మారలేదు...
రాష్ట్రం ఏర్పాటు అయ్యాక ప్రభుత్వం కళాకారులకు సాంస్కృతిక సారధి పేరిట కొంతమందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి మా లాంటి ఉద్యమ కళాకారులను ప్రభుత్వం విస్మరించింది గత 8 సం,, లు గా ప్రభుత్వం చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన కనీసం కళాకారులను పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ ప్రభుత్వం సాంస్కృతిక సారధి కళాకారులు 583 మంది కి వేతనాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అదే విధంగా మిగిలిన రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి నిజమైన ఉద్యమ కళాకారులను ఇప్పటికైనా గుర్తించి ఉద్యమ కళాకారులందరికీ ఉద్యోగం మరియు ఉపాధి కల్పించాల్సిందిగా స్థానిక నాయకులను మరియు గౌరవ ముఖ్యమంత్రి గారిని మరియు సాంస్కృత శాఖ మంత్రివర్యులు మరియు సాంస్కృతిక శాఖ చైర్మన్ రసమయి బాలకిషన్ గారిని కోరుతున్నాము ... దయచేసి ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మా బాధలను అర్థం చేసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించినటువంటి ఉద్యమ కళాకారులందరూ ఏకమై ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మా యొక్క కళాలకు మా యొక్క గళాలకు పదును పెట్టి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపే లక్ష్యంగా కళాకారులందరూ ఏకం కావలసి వస్తుందని తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారులు వేముల హరిక్రిష్ణ మాట్లాడారు... ఈ కార్యక్రమంలో ఉద్యమ కళాకారులు పోలెపాక నర్సింహ మరియు కూచిమల్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు...

# ఐ టి డి ఏ ఆధ్వర్యంలో జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోగలరు ...ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్



**భద్రాచలం ఆగస్ట్ 31 శుభ తెలంగాణ :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పరిధిలోగల గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగం కల్పించే నిమిత్తము జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ జాబ్ మేళాకు హాజరయ్యే గిరిజన యువకుల వయసు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాలు గల యువతకి నవత రోడ్డు ట్రాన్స్పోర్ట్, ముత్తూట్ ఫైనాన్స్, సన్ షైన్ హెల్త్ కేర్, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, టాటా లైఫ్ ఇన్సూరెన్స్, వెంకటేశ్వర సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలలో గల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఆసక్తి గల గిరిజన యువత విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ జిరాక్స్ సర్టిఫికెట్లు తో 06-09-2023 తేదీ నాడు ఉదయం 9 గంటలకు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన తెలుపుతూ, పూర్తి సమాచారం కొరకు 81 43 84 09 06, 85 20 869805 ఫోన్ నెంబర్లకు సంప్రదించి తెలుసుకోవాలని ఆయన కోరారు.

# నిరుపేద కుటుంబానికి ఏ జే ఆర్ ఫౌండేషన్ చేయూత

- రాజకీయాలకు అతీతంగా నిరుపేదలను ఆదుకుంటున్న ఏజేఆర్ ఫౌండేషన్



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :** భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన షేక్ గుంశ, భార్య సమీనా దంపతులు వీరు జీవనాధారం కోసం భువనగిరిలో ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె ఒక కుమారుడు ఉన్నారు. మీరు నిరుపేద కుటుంబం కావడంతో బ్రతు కే భారంగా వెళ్లదీస్తూ దీనవస్థలో ఉండడంతో వారి పరిస్థితిని చూసినా ఏజేఆర్ చలించిపోయి ఏ జే ఆర్ ఫౌండేషన్ సభ్యులను వారి వద్దకు పంపించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని టీ షాప్ పెట్టుకొనుటకు పదివేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా సమీనా గుంశ దంపతులు వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ జే ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అధ్వానంగా తాడుమనూర్ రోడ్డు



**శుభ తెలంగాణ :** పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ నుండి తాడు మనూరు వరకు గల బిటి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది.దామోదర్ రాజనర్సింహ హయాంలో వేసిన రోడ్డు ప్రస్తుతం కనీసం ప్యాచ్ వర్క్ లు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని తాడుమనూర్ మరియు బస్వాపూర్ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.రోడ్డు మార్గంలో వెళ్లే వాహనదారులు పలుమార్లు గాయాల పాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ పాలకులు స్పందించి నూతన రోడ్డును వేయాలని రెండు గ్రామాల ప్రజలు విన్నపించుకుంటున్నారు.

# అన్నాచెల్లెళ్ల అక్క తమ్ముళ్ల అనుబంధానికి ప్రతిరూపమే ఈ రాఖీ పండుగ: ఎస్సై పెండ్యాల ప్రభాకర్

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు
- ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న విద్యార్థులు
- దటీజ్ ఫ్రెండ్లీ పోలీస్



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :**వలిగొండ మండల పరిధిలోని లోతుకుంట కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ పెండ్యాల ప్రభాకర్,విద్యార్థులకు రాఖీలు,స్వీట్లు పంపిణీ చేసి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థులు ఎస్ఐ ప్రభాకర్ కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.ఈ సందర్బంగా ఎస్ఐ పెండ్యాల ప్రభాకర్ మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు,అక్క తమ్ముళ్ళ అనుబంధాలను బలోపేతం చేస్తుందనీ,సోదరి సోదరిమనుల మధ్య ఉండే అనుబంధానికి,ప్రేమానురాగాలను అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల పెరుగుదలకు,విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుందనీ ఆత్మీయుల మధ్య అనుబంధాలకు,ఐకమత్యానికి,పరస్పర సహకారానికి చిహ్నంగా రక్ష బందనం నిలుస్తుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు

# సీఎం కెసిఆర్ కు కళాకారులు రుణపడి ఉంటాం.



**మంత్రి శ్రీనివాస్ గౌడ్,రసమయి బాలకిషన్, మామిడి హరికృష్ణ కు కళాభివందనాలు.**
**తెలంగాణ సాంస్కృతిక సారథి.**
**మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు రవీందర్ గౌడ్ (గూడూరు).**
**కళాకారులకు పి ఆర్ సీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం.**

**గూడూరు మహబూబాబాద్ శుభ తెలంగాణ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కళాకారులకు పీఆర్సీ ప్రకటించడం తో కళాకారులు రుణపడి ఉంటామని తెలంగాణ సాంస్కృతిక సారథి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఉద్యమ గాయకులు మెరుగు రవీందర్ గౌడ్ (గూడూరు) పత్రికా ప్రకటన లో తెలియజేశారు.గురువారం గూడూరు మండల కేంద్రంలో సంస్కృతిక సారధి కళాకారులకు పి ఆర్ సీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.
పిఆర్సి ల కోసం కష్టపడ్డటువంటి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సాంస్కృతిక సారధి చైర్మన్ పాటల పెద్దన్న రసమయి బాలకిషన్, మామిడి హరికృష్ణ కు కళాభివందనాలు తెలియజేశారు. కళాకారులు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలంగాణ సాంస్కృతిక సారథి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఉద్యమ గాయకులు మెరుగు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరుస్తూ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన సాంస్కృతిక సారథి కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వేతనాలు పెంచింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని భారత దేశంలో ఎక్కడా లేని విధంగా, తెలంగాణ ఉద్యమ కళాకారుల కుటుంబాలకు స్వరాష్ట్రం లో భరోసా కల్పించేందుకు వారికి ప్రభుత్వ పరంగా సాంస్కృతిక సారథి సంస్థ ను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించడం దేశ చరిత్రలో మెట్ట మొదటిసారి అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులను ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు గుర్తించి 583 మందికి ఉద్యోగాలు కల్పించారని ప్రతి నెల వారికి రూ.24,514 రుపాయల భృతిని కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమంలో భాగంగా కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అదనంగా 30 శాతం వేతనం పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు తీసుకున్న నిర్ణయాన్ని కళాకారుల తరపున ఆనందం వ్యక్తం చేస్తూ కళాకార్లమంతా సీఎం కెసిఆర్ కు రుణపడి ఉంటామని వారన్నారు.

# కిశోర్ గెలుపు కోసం మోకాళ్ళ ప్రదక్షణ చేసిన దగ్గుల వినోద్



**శుభ తెలంగాణ :**మద్దిరాల మండలనికి చెందిన గాదరి కిశోర్ వీరాభిమాని సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దగ్గుల వినోద్ యాదవ్ తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ మూడోసారి కూడా గెలవాలని కోరుతూ చివ్వేంల మండలంలోని దూరాజ్ పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి ఆలయంలో మోకాళ్ళ ప్రదక్షిణ చేశారు.ఈ సందర్భంగా దగ్గుల వినోద్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే నాయకుడు గ్యాదరి కిశోర్ గెలిస్తేనే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు, విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఏమ్మెల్యే గాదరి కిశోర్ అభిమానులు,ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రియుడి ఇంటి ముందు న్యాయం చేయాలని మహిళ నిరసన

- పెళ్లికి నిరాకరిస్తున్న ప్రియుడు
- తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్న మహిళ
- శారీరకంగా మానసికంగా హింసించిన ప్రబుద్ధుడు



**వలిగొండ ఆగస్టు 31 శుభ తెలంగాణ :**వలిగొండ మండల పరిధిలోని గోకారం గ్రామంలో ప్రియుడి ఇంటి ముందు మహిళ తన ఇద్దరు పిల్లలు మరియు తన తల్లిదంద్రులతో కలిసి నిరసన తెలుపుతున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని జాలుకాలువ గ్రామానికి చెందిన పల్లపు భాగ్యలక్ష్మి కి 2014 సంవత్సరంలో ఆలేరు పట్టణానికి చెందిన పల్లపు రమేష్ తో వివాహం జరిగింది. వివాహం జరిగి ఒక కుమారుడు ఒక కుమార్తె ఇద్దరు పిల్లలు జన్మించారు. ఇదిలా ఉండగా గోకారం గ్రామానికి చెందిన దేశపాక పరమేష్ తన అత్తవారింటికి వచ్చి ఇద్దరు పిల్లలు తనకే జన్మించారని, ఆమె నాతోనే ఉండాలని 2017 సంవత్సరంలో నానా రభస చేయడంతో అత్తింటి వారు తనను ఇంటి నుంచి పంపివేశారని ఆమె వాపోయారు. తన బ్రతుకుతెరువు కోసం చౌటుప్పల్ పట్టణంలో జీవనం సాగిస్తుండగా అక్కడికి కూడా వచ్చి పరమేష్ తనను మానసికంగా, శారీరకంగా హింసించాడని తనను తనవారికి కాకుండా చేసి నేడు తప్పించుకు తిరుగుతున్నాడని పెద్ద మనుషులు న్యాయం చేస్తామని చెప్పి తనకు అన్యాయమే చేశారని ఆమె ఆవేదన వెలిబుచ్చారు. తనకు తన ఇద్దరు పిల్లలకు చావే శరణ్యమని, దేశపాక పరమేష్ తనను వివాహం చేసుకోవాలని లేనిపక్షంలో తను చనిపోయేంత వరకు నిరసన పోరాట దీక్ష కార్యక్రమాన్ని కొనసాగిస్తానని ఆమె అన్నారు.

# బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- కనిగిరి టీడీపీ ఇంచార్జ్ ఉగ్ర





**కనిగిరి శుభ తెలంగాణ :** కనిగిరి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇంచార్జ్ ఉగ్ర నరసింహ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లతో సమీక్షాసమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# యువ గళానికి 200 రోజులు పూర్తి

**కనిగిరి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఉగ్ర**

**శుభ తెలంగాణ :**కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో యువ గళం నారా లోకేష్ పాదయాత్ర 200 రోజులు 2709 కిలో మీటర్లు పూర్తయిన సందర్భంగా పట్టణము లోని అమరావతి గ్రౌండ్ నుండి చాకిరాల వరకు భారీ ర్యాలీతో నారా లోకేష్ కు సంఘీభావం యాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పిట్లం మండల వ్యాప్తంగా ఘనంగా రాఖి పండగ వేడుక లు...

**శుభ తెలంగాణ :** కామారెడ్డి జిల్లా పిట్లం మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పిట్లం తో పాటు పిట్లం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో గౌరారం రాంపూర్ మద్దతు బొ ల్లక్ పల్లి బండపల్లి సిద్ధాపూర్ చిల్లర్గి కిష్టాపూర్ చిన్న కొడంగల్ తదితర గ్రామాలలో ప్రజలందరూ రాఖీ పౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు సందర్భంగా గౌరారం గ్రామ సర్పంచ్ అనసూయ శంకర్ మాట్లాడుతూ అన్నా చెల్లెల అనుబంధం ప్రతీక రాఖీ పండగ అక్క తమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు ఆప్యాయత అనుబంధం ఎన్నేళ్లయినా చెక్కుచెదరకుండా ఉండే బంధమే రక్షాబంధన్ ఆ బంధాన్ని తెలిపేది రక్షాబంధన్ పండగ అనుబంధాలకు సోదరీ సోదరీమణుల మధ్య ఉంది అనుబంధం ప్రేమానురాగాలకు మద్యం పట్టి పండుగ కావడంతో మానవ సంబంధాల పెరుగుదలకు విచక్షణకు ఇది ఎంతో ద్రోహం చేస్తుందని ఆత్మీయుల మధ్య ఐక్యమత్యానికి పరస్పర సహకారానికి చిన్నంగా రక్షాబంధన్ నిలుస్తుందని ఆయన అన్నారు.

## పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా పలు కార్యక్రమాలు చేయనున్న పెంటేల బాలాజి




**పల్నాడు ఇంఛార్జ్ శుభ తెలంగాణ :**జనసేన పార్టీ అధ్యక్షులు సెప్టెంబర్ 2 వ తారీఖున పవన్కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా 1-9-2023 తారీఖు ఉదయం 8:30 నిముషాలుకు బోయపాలెం అమ్మవారి ఆలయంలో అశేష వీర మహిళలతో కలిసి పూజలు నిర్వహించడం జరుగుతుంది 11 గంటలకు స్కూల్ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు ఇవ్వటం జరుగును సాయంత్రం 4 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ కార్యక్రమం జరుగును రాత్రి 7 గంటలకు పుట్టకోట లో నిర్వహించనున్న భారీ కేక్ కటింగ్ మరియు భోజనం వితరణ కార్యక్రమం లో పాల్గొనటం జరుగును. 1,2,3 తారీఖులలో భారీ సేవా కార్యక్రమాలు మరియు జనసేన జెండా ఆవిష్కరణలు ఉంటాయని ఈ కార్యక్రమాలలో జనసేన నాయకులు మరియు కార్యకర్తలు విరివిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా నియోజకవర్గం నాయకులు పెంటేల బాలాజి కోరారు

## సమగ్ర భూసర్వే ప్రయోజనాలు ప్రజలకు తెలియజేయాలి: సి.యం జగన్మోహన్ రెడ్డి



**పల్నాడు జిల్లా సెప్టెంబరు 1 శుభ తెలంగాణ :**రాష్ట్రంలో భూ సంస్కరణల వల్ల జరుగుతున్న మేలును ప్రజలకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సి.యం జగన్ అధికారులకు సూచించారు. రెవెన్యూ విభాగంలో తీసుకున్న నిర్ణయాలు, సమగ్ర భూసర్వే వల్ల ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారూ.

భూవివాదాల పరిష్కారానికి మొబైల్ కోర్టులు ఏర్పాటు చేయాలి.

భూ వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి మండల స్థాయిలో మొబైల్ కోర్టులు ఏర్పాటుచేయాలని సి.యం జగన్ అధికారులను ఆదేశించారు. శాశ్వత భూహక్కు, భూరక్షపై సమీక్షలో మాట్లాడుతూ.. 'చాలా రాష్ట్రాల్లో మండలానికి ఒకరిద్దరు సర్వేయర్లు ఉంటే.. ఇక్కడ ప్రతి గ్రామ సచివాలయంలో సర్వేయర్ ఉన్నారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణకు ఈ వ్యవస్థ బాగా ఉపయోగపడుతోంది. రిజిస్ట్రేషన్ వ్యవస్థనూ సచివాలయాల్లో ప్రవేశపెట్టాం' అని అన్నారు.

## ఆత్మీయత, అనురాగాలకు ప్రతీక రాఖీ పండగ: ప్రత్తిపాటి

- మాజీమంత్రి ప్రత్తిపాటికి రాఖీలు కట్టిన తెలుగు మహిళలు



**చిలకలూరిపేట సెప్టెంబర్ 1 శుభ తెలంగాణ :**అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్ల ప్రేమ, అనురాగం, అనుబంధం ఎంతో గొప్పదని.. అందుకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. రక్షాబంధన్(రాఖీ పౌర్ణమి) సందర్భంగా తెలుగు మహిళలు ప్రత్తిపాటికి రాఖీలు కట్టి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మహిళలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గ ఆడపడచులందరికీ అన్నలా అండగా.. తమ్ముడిలా తోడుగా ఉంటానని ప్రత్తిపాటి అన్నారు. మహిళలు సాధికారత సాధించేందుకే తెదేపా అధినేత చంద్రబాబు భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మహిళలకు ప్రత్యేక పథకాలు ప్రకటించారని ప్రత్తిపాటి వెల్లడించారు.

# రాబోతోంది తెలుగుదేశం ప్రభంజనం

- మాజీమంత్రి ప్రత్తిపాటి
- యువగళానికి జనహారతులే సాక్ష్యం: ప్రత్తిపాటి పుల్లారావు
- యువగళం ప్రజాగళమైంది.. పాదయాత్ర జనయాత్రగా మారింది: ప్రత్తిపాటి
- యువగళం 200 రోజుల సందర్భంగా ప్రత్తిపాటి సంఘీభావ పాదయాత్ర



**శుభ తెలంగాణ :** లోకేశ్ ఒక్క అడుగే.. ఉత్తుంగ తరంగమైందని.. మార్పు కోసం మొదలైన ప్రజా యాత్ర జనసంద్రం అవుతూ దిగ్విజయంగా సాగుతోందని మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నిన్నటి కంటే ఈ రోజు.. ఈ రోజు కంటే రేపు.. బావుండాలి అని రాష్ట్రం, రాష్ట్ర భవిష్యత్ కోసం కలలు గన్న దార్శనికుడు చంద్రబాబు బాటలో సాగుతున్న యువనేత జన చేతనయాత్ర 200 రోజులు పూర్తి చేసుకోవడం సంతోషకరమని ప్రత్తిపాటి తెలిపారు. వారసుడి నుంచి ప్రజాకర్షకనేతగా, భయం వైపు నుంచి భవిష్యత్తుపై భరోసా దిశగా.. అవహేళనల నుంచి అద్భుతం అనిపించుకునేలా లోకేశ్ చేశారని ప్రత్తిపాటి చెప్పారు. గతంలో జరిగిన పాదయాత్రలన్నీ ఒక ఎత్తయితే.. లోకేశ్ యువగళం పాదయాత్ర మరో ఎత్తని.. అడుగుపెట్టిన ప్రతిచోటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలతో మమేకమై ఆయా వర్గాల సమస్యలపై యువగళాన్ని మార్మోగిస్తున్నారని తెలిపారు. లోకేశ్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్తిపాటి సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. యడ్లపాడు మండలం సంగం గోపాలపురం నుంచి చెంఘీజ్ఖాన్పేట ఇస్కాన్ ఆలయం వరకు పాదయాత్ర సాగింది. భారీగా హాజరైన జనసందోహం మధ్య ప్రత్తిపాటి ఉత్సాహంగా నడిచారు. చెంఘీజ్ఖాన్పేట వద్ద ఇస్కాన్ ఆలయం వద్ద ప్రత్తిపాటి సెల్ఫీ ఛాలెంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు 400 రోజుల పాటు... 4000 వేల మీటర్ల మేర తలపెట్టిన మహాసంకల్పంలో సరిగ్గా ప్రథమార్థం పూర్తి చేసుకుందని.. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఎవరు కనని... వినని రీతిలో సాగుతున్న ఈ పవిత్రయజ్ఞ సంకల్పం.. రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలనకు చరమగీతం పాడనుందని అన్నారు. ఈ అరాచకపాలనలో భీతిల్లిన కోట్లాదిమంది ప్రజలకు నేనున్నా అని ఒక భరోసా ఇవ్వడమే లక్ష్యంగా వారి కష్టాలు వింటూ, కన్నీళ్లు తుడుస్తూ... రేపటి మీద ఆశలు కల్పిస్తూ లోకేశ్ ముందుకు సాగిపోతున్నారని ప్రత్తిపాటి వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకుని రావడం.. ఆ పునరాగమనంలో యువతరానికే పెద్దపీట వేయడమే నినాదాలుగా రాజకీయ యాత్రల్లోనే సరికొత్త చరిత్ర లిఖిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అడుగుపెట్టిన ప్రతిచోటా జనహారతులు, పార్టీ జయజయధ్వనాలే రాబోతున్న మార్పుకి సంకేతాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెదేపా చరిత్ర సృష్టించబోతోందన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే ఉద్దేశంతో తెదేపా ప్రభుత్వ హయాంలో ఇస్కాన్ సంస్థకు 77 ఎకరాలు ఇవ్వడం జరిగిందని.. హంస దేవాలయంగా రూపొందించేలా ఇస్కాన్ ఆలయ నిర్వాహకులు నమూనా కూడా తయారు చేశారని ప్రత్తిపాటి తెలిపారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఇస్కాన్ నిర్వాహకులను నిరుత్సాహపరిచారని.. కొండవీడు కోటను నిర్వీర్యం చేశారని ప్రత్తిపాటి ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొండవీడు కోట, ఇస్కాన్ ఆలయ పరిసర ప్రాంతాల్లో రైతుల భూముల ధరలు రూ.2 కోట్ల వరకు పలికాయని.. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పడిపోయి ఇబ్బందులు పడుతున్నారని ప్రత్తిపాటి వెల్లడించారు. ఇస్కాన్ ఆలయ అభివృద్ధిపై మంత్రి రజిని ఒక్కసారైనా సమీక్ష నిర్వహించారా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు.

## శ్రీ దత్త సాయి సన్నిధిలో శ్రావణ పౌర్ణమి పూజ, భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం





**శుభ తెలంగాణ :**చిలకలూరిపేట సుబ్బయ్య తోట శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేంచేసియున్న శ్రీ దత్త సాయి సన్నిధిలో ఈరోజు శ్రావణమాసం గురువారం పౌర్ణమి సందర్భంగా ఉదయాన్నే బాబా గారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు జరిగినాయి అనంతరం బాబా గారికి మల్లెపూలతో గులాబీ పూలతో అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమం జరిగింది అనంతరం భక్తులు బాబా గారికి భక్తులు విద్యార్థులు బాబా గారికి రాఖీ పౌర్ణమి సందర్భంగా బాబాగారికి రాఖీ సమర్పించి బాబా గారి చేతికి స్వయంగా భక్తులే కట్టి ఉన్నారు విద్యార్థులచే అమ్మవారికి సాయి మంత్ర పారాయణ అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం జరిగింది షిర్డీ సాయినాధునికి ప్రత్యేకంగా మరి చిన్నారులచే హారతి నిర్వహించడం జరిగింది అనంతరం విద్యార్థులు బాబా గారికి రాఖీ కట్టియున్నారు. అనంతరం భక్తులకు శ్రీమతి పూసపాటి అనురాధ పుట్టినరోజు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కొత్తూరి హనుమంతరావు అయినవోలు హనుమంతరావు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించి సద్గురు అనుగ్రహం పొందగలరని తెలియజేసారు

## చింతపల్లిలో డబుల్ బెడ్ రూమ్ పంపిణీ



**శుభ తెలంగాణ :**చింతపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రభుత్వం కేటాయించనుంది. ఈ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ర్యాండమైజెషన్ సాఫ్ట్ వేర్ ద్వారా లక్కీ డ్రాను నిర్వహించారు. ఈ లక్కీ డ్రాలో ఎవరి పేర్లు అయితే వస్తాయో వారికి ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేశారు ఈ లక్కీ డ్రాలో ఎంపిక అయిన 25 మంది లబ్ధిదారులను ఎంపికయ్యారు. ఈ కార్యక్రమాన్ని చింతపల్లి లోని. ఎంపీడీఓ కార్యాలయంలో లక్కీ డ్రాలో ఎంపిక అయిన వారి పేర్లను వెల్లడించారు. అలాగే ఈ కార్యక్రమానికి ఆర్ డి ఓ, ఎమ్మార్వో, సర్పంచి ముచ్చర్ల యాదగిరి ,పోలీస్ లు ,ప్రజ ప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు

## భవిష్యత్తుకు గ్యారెంటీపై నమ్మకం కల్పించాలి: ప్రత్తిపాటి





**శుభ తెలంగాణ :**మినీ మేనిఫెస్టోలోని పథకాలు వివరించి రానున్న ఎన్నికల్లో మెజార్టీ ఓటర్ల మద్దతు సాధించడమే లక్ష్యంగా తెదేపా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గురువారం చిలకలూరిపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ 45 రోజుల కార్యక్రమంపై క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ఛార్జులు, మండల కమిటీ సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. సహజ వనరులను, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను దోచేస్తూ సైకో ప్రభుత్వం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని ప్రత్తిపాటి విమర్శించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి భవిష్యత్తుకు గ్యారెంటీపై నమ్మకం కల్పించాలని ప్రత్తిపాటి సూచించారు. వైకాపా అరాచక పాలనపై వివరిస్తూనే తెదేపా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని.. ప్రజలతో మమేకం కావాలని ప్రత్తిపాటి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెదేపా గెలుపు కోసం సంయుక్తంగా కృషి చేయాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## ఏపి పోలీస్ ప్రధాన కార్యాలయం పై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు.

**శుభ తెలంగాణ :**కార్యాలయ కార్యనిర్వహణా అధికారిపై ఏసీబీ అధికారులు దాడి. ప్రభుత్వ పెద్దల అనుమతితోనే దాడులు జరిగినట్టు విశ్వాసనీయ సమాచారం. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంపై దాడుల నేపథ్యంలో పోలీసు వర్గాల్లో చర్చనీయాంశం.

ఏఓని విఆర్ లో పెట్టిన ఉన్నత అధికారులు మహిళాధికారికి ఏఓగా భాధ్యతలు అప్పగించిన అధికారులు. కార్యాలయంపై ఏసీబీ అధికారుల దాడుల విషయాన్ని గోప్యంగా ఉంచిన సిబ్బంది.

## వాతావరణం సమాచారం బంగాళాకాతం ల అల్పపీడనం ఏర్పడుతుంది.




**శుభ తెలంగాణ :**పై మ్యాప్ పోయింట్ లో చూపిన విధంగా బంగాళాకాతం లో అల్పపీడనం (%ా%) ఏర్పడుతుంది.రేపు, ఎల్లుండి వరకు ఏండా తీవత్ర అధికంగా గా నమోదవుతుంది. సెప్టెంబర్ 1 తారీకు మధ్యాహ్నం సమయం లో కొన్ని చోట్ల మాత్రమే వర్షాలు నమోదవుతాయి. సెప్టెంబర్ 2 నుంచి వర్షాలు పెరిగే అవకాశలు కనిపిస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, బాపట్ల, విజయవాడ, దివిసీమ భాగాల్లో, మచిలీపట్నం, ఏలూరు, గుడివాడ, వివిధ భాగాల్లో సెప్టెంబర్ 1,2,3,4,5, వరకు వర్షాలు కొనసాగుతాయి. ఈ వర్షాలు కొన్ని చోట్ల మోస్తారుగాను, మరి కొన్ని చోట్ల భారీగా నమోదవుతాయి.వాతావరణం లో మార్పు ఉంటే అప్డేట్ అనేది ఇస్తాను.



**శుభ తెలంగాణ :**హైదరాబాదులో మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు పెద్దలు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీస్సులు తీసుకున్నాను

# సోదరభావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి..





ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి....

సైనిక్ పూరి లోని పార్టీ కార్యాలయం లో ఘనంగా రక్ష బంధన్ వేడుకలు...

బీఎల్ఆర్ కు రాఖీ కట్టిన నియోజకవర్గ మహిళ సోదరీమణులు....

**ఉప్పల్ నియోజకవర్గం,ఆగస్టు31,(శుభ తెలంగాణ)** ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సందేశాన్ని తెలియజేయడమే రక్షాబంధన్ ఉద్దేశ్యమని ఉప్పల్ నియోజకవర్గ బీ ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు.గురువారం సైనిక్ పూరి లోని పార్టీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి,సంప్రదాయాలకు నిలయమైన మన దేశంలో ప్రతి పండుగ పరమాత్ముని అవతరణ, దివ్య కర్తవ్యాన్ని సూచిస్తుందన్నారు.పరస్పర మాటలు, దృష్టి స్వభావ సంస్కారాలు నిష్కల్మషంగా ఉండాలనే రాఖీ కట్టి మిఠాయి తినిపిస్తారని తెలిపారు. ప్రేమానురాగాలకు రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షా బంధన్ పండుగ సహోదరత్వానికి తార్కాణమని అన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నాదమ్ముల్లకు అనురాగంతో చేతికి రక్షా బంధనాన్ని కట్టడం గొప్ప సందర్భం అని ఆయన తెలిపారు. రక్షాబంధన్ సాంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని, ప్రజల్లో సహోదరత్వాన్ని మరింతగా పెంపొందిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రేమనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఆనందోత్సాహాల్లో జరుపుకుంటారు అని ఆయన తెలిపారు.

# బీసీ శక్తి సంఘం రాష్ట్ర కో కన్వీనర్ గా పాపబత్తిని సామ్యూల్ రోల్లిన్ .....

## బీసీ శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్...

**హైదరాబాద్, ఆగస్టు 31,(శుభ తెలంగాణ)**బీసీ శక్తి సంఘం రాష్ట్ర కో కన్వీనర్ గా పాపబత్తిని సామ్యూల్ రోల్లిన్ ఎన్నిక.గురువారం హైదరాబాద్ లోని బీసీ శక్తి సంఘం భవన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన బీసీ శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్.ఈ సందర్భంగా పిట్ల నగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ బీసీలను ఒక తాటిపైకి తెచ్చి జనాభా ప్రాతిపదికన బీసీలకు అందాల్సిన సంక్షేమ పథకాలను, రిజర్వేషన్లను, హక్కులను పొందేందుకు పెద్ద ఉద్యమమే చేస్తున్నామని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చెంప పాటు మా ఉద్యమం ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు

. అలాగే బీసీలకు ఎన్నికల్లో తగ్గిన ప్రాధాన్యత ఇవ్వాలని రాజ్యాధికారం పొందేందుకు రాజకీయ పార్టీలు అన్ని చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం బీసీ శక్తి సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పాపబత్తిని సామ్యూల్ రోల్లిన్ మాట్లాడుతూ బీసీ శక్తి సంఘం తనను ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు పిట్ల నాగేష్ ముదిరాజ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బీసీ శక్తి సంఘం ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ప్రజలకు రాజ్యాధికారం యొక్క విలువన్ను అర్థమయ్యే విధంగా చెప్తానని బీసీలకు సమయాన్ని కలిపించేంత వరకు పోరాటం చేస్తామని అలాగే వారిని చైతన్య పరుస్తానని ఒక సామాజిక ఉద్యమానికి ఊపిరి పోస్తానని రాష్ట్రంలో బీసీల పట్ల జరుగుతున్న అన్యాయాలన్ను అక్రమంగా తిప్పి కొడతామని అన్నారు.



# బీసీ శక్తి సంఘం రాష్ట్ర కో కన్వీనర్, రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఐతనబోయిన రామారావు.....



## బీసీ శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్...

**హైదరాబాద్, ఆగస్టు 31,(శుభ తెలంగాణ)**గురువారం హైదరాబాద్ లోని బీసీ శక్తి సంఘం భవన్ లో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్ బీసీ శక్తి సంఘం రాష్ట్ర కో కన్వీనర్,రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఐతనబోయిన రామారావు ప్రకటించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నాగేష్ మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం పోరాడాలని ఎన్నో ఏళ్లుగా రాజ్యాధికారానికి దూరంగా ఉన్నామని బీసీలకు నేటికీ న్యాయం దక్కలేదని. బీసీలు అంటే కేవలం ఒక ఓటు బ్యాంకు గానే చూసే ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని.రాజకీయ పునరేగీకరణ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బీసీ శక్తి సంఘం రాష్ట్ర కోకన్వీనర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఐతనబోయిన రామారావు మాట్లాడుతూ బీ. సీ శక్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే వారిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని బీసీలను ఏకం చేసి ఒక తాటి పైకి తీసుకొచ్చి రాజ్యాధికారం వైపు అడుగులు వేసే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి శక్తి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేశ్ కు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

200వ రోజుకు చేరుకున్న లోకేశ్ యువగళం పాదయాత్ర

ఇప్పటి వరకు 77 నియోజకవర్గాల్లో కొనసాగిన యాత్ర

యువగళం.. ప్రజాగళంగా మారిందన్న చంద్రబాబు



**హైదరాబాద్, ఆగస్టు 31,(శుభ తెలంగాణ)**టీడీపీ యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర 200వ రోజుకు చేరుకుంది. ఈ ఏడాది జనవరి 27న ప్రారంభమైన పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 77 నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగింది. లోకేశ్ ఇప్పటి వరకు 2,710 కిలోమీటర్లు నడిచారు. 64 బహిరంగ సభలు, 132 ముఖాముఖి సమావేశాల్లో లోకేశ్ పాల్గొన్నారు. పాదయాత్ర 200వ రోజుకు చేరుకున్న సందర్భంగా లోకేశ్ కు టీడీపీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కూడా తన కుమారుడికి శుభాకాంక్షలు తెలిపారు. యువగళంగా ప్రారంభమైన పాదయాత్ర... ప్రజాగళంగా మారిందని ఆయన అన్నారు. లోకేశ్ అతని టీమ్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు.

# అమెరికాకు వెళుతున్న బండి సంజయ్

రేపు తెల్లవారుజామున యూఎస్ కు పయనమవుతున్న బండి సంజయ్

10 రోజుల పాటు అమెరికా పర్యటన

పలు ఎన్నారై సంఘాలతో భేటీ కానున్న బీజేపీ నేత



**హైదరాబాద్, ఆగస్టు 31,(శుభ తెలంగాణ)**తెలంగాణ బీజేపీ నేత, ఎంపీ బండి సంజయ్ అమెరికా పర్యటనకు వెళ్తున్నారు. రేపు ఉదయం తెల్లవారుజామున ఆయన యూఎస్ కు పయనమవుతున్నారు. 10 రోజుల పాటు ఆయన అమెరికాలో ఉండనున్నారు. సెప్టెంబర్ 2న అట్లాంటాలో జరిగే అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) 15వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని, ప్రసంగించనున్నారు. న్యూజెర్సీ, డల్లాస్, న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ రాష్ట్రాల్లో ఆయన పర్యటించబోతున్నారు. పలు తెలుగు ఎన్నారై సంఘాలతో భేటీ అవుతారు. ఈ సమావేశాల్లో రాజకీయ, సినీ, సాహిత్య, వైద్య, వ్యాపార, సేవా, నాటక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. అమెరికా పర్యటనను ముగించుకుని సెప్టెంబర్ 10న ఆయన స్వదేశానికి తిరిగి రానున్నారు.

# ఈపీఎఫ్ వో కొత్త రూల్.. వ్యక్తిగత వివరాల్లో మార్పులు ఇక ఈజీ

దరఖాస్తు చేసుకున్న రెండు వారాల్లో పరిష్కారం

కేవలం ఒక్కసారి మాత్రమే మార్పులకు అవకాశం

మోసాలను నియంత్రించేందుకేనన్న అధికారులు




**హైదరాబాద్, ఆగస్టు 31,(శుభ తెలంగాణ)**ఉద్యోగుల వ్యక్తిగత వివరాలలో పొరపాట్లు, తప్పులను సవరించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్ వో) కొత్త రూల్ ను తీసుకొచ్చింది. దీంతో వ్యక్తిగత వివరాల్లో మార్పులు చేర్పులు మరింత సులభం కానుందని పేర్కొంది. అదే సమయంలో మోసాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు, ఈ మార్పులకు కేవలం ఒకేసారి అవకాశం కల్పించినట్లు తెలిపింది. ఉద్యోగి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా సమస్యను పరిష్కరించేలా సిబ్బందికి గడువు విధించినట్లు వివరించింది. చిన్న చిన్న సవరణలను వారం రోజుల్లోపు పూర్తిచేయాలని సూచించింది. ఈ ఆదేశాలను, సూచనలను పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఉద్యోగి వ్యక్తిగత సమాచారంలో పొరపాట్ల కారణంగా చాలా క్లెయిమ్ లు తిరస్కారానికి గురవుతున్నాయి. నగదు ఉపసంహరణ, ఉద్యోగ విరమణ తర్వాత పీఎఫ్ డబ్బులు విత్ డ్రా చేసుకోవాలన్నా, పింఛన్ కు దరఖాస్తు చేసుకోవాలన్నా ఈపీఎఫ్ వో చందాదారులు ఇబ్బంది పడుతున్నారు. పరిష్కారం కోసం వ్యక్తిగత వివరాల్లో సవరణలకు ప్రాంతీయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. చందాదారులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను గుర్తించి, దీనిని పరిష్కరించేందుకే కొత్త రూల్ ను తీసుకొచ్చినట్లు ఈపీఎఫ్ వో పేర్కొంది.

**ఏయే సవరణలకు అవకాశం ఉందంటే..**

పేరు, స్త్రీ/పురుషుడు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, బంధుత్వం, వివాహం, ఈపీఎఫ్ వో లో చేరిన తేదీ, ఆధార్ నెంబర్, ఉద్యోగంలో చేరిన/ వదిలిపెట్టిన తేదీ, జాతీయత ఇందులో వివాహ స్థితిని మార్చుకునేందుకు రెండుసార్లు, మిగతా వివరాల్లో ఒక్కసారి మాత్రమే మార్చుకునే అవకాశం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ఒకటికంటే ఎక్కువ సార్లు సవరణ చేయాల్సి వస్తే నిర్ణయాధికారాన్ని ఈపీఎఫ్ వో ప్రాంతీయ కమిషనర్లకు కల్పించింది.

సవరణలు చిన్నవైతే రెండు ధ్రువీకరణ పత్రాలు, పెద్దవైతే మూడు ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తులకు జత చేయాలి.

Edited, Printed, Published & Owned by Sri ChandraShekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandraShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com